# ఆ ఊరి కథ




గుత్తుల భాస్కరరావు

"నువ్వేం చెప్పదలుచుకున్నావు అని నన్నెవడూ నిలదీసి అడక్కపోతే చిన్న కథ చెబుతాన్రా మీకు" అన్నాడు శంకరం మమ్మల్ని చుట్టూ పోగు జేసుకుని. "అడగంలే చెప్పు" అని సావధానంగా కూర్చున్నాం.

"అది చాలా మారుమూల పల్లెటూరు. చిన్న అరుగుబడి తప్ప ఒక వంతెన లేదు. ఒక రోడ్డులేదు. కరెంటు సంగతి అడగనక్కర్లేదు ఆ ఊరు మొహం పైవాళ్ళు చూడకపోవడానికి కారణం ఊళ్ళోవాళ్ళు మొహమొహాలు చూసుకోకపోవడమే. ఎడ్డెమంటే తెడ్డెమనేవాళ్ళు ఎక్కువ. ఎడ్డెమనేవాళ్ళు యువకులు. తెడ్డె మనేవాళ్ళు వయోవృద్ధులు. వందపైన బ్రతకడంలో రికార్డులు స్థాపించి ఇంకా బ్రతుక్కొస్తున్న ముసలివాళ్ళు ప్రతి పనిని అడ్డంకొట్టి దానివల్ల ప్రయోజనాల సంగతి ఎలా ఉన్నా అనర్థాలవి భూతద్దంలో చూపించి ఆపి వేసేవారు. ఈ పనిచేస్తే మన ఊరు సర్వనాశనమైపోతుంది ఫలానా అమ్మవారి శాపం ప్రకారం అనేవారు. నాలుగు ముక్కలొచ్చి పట్నం చదువులకెళ్ళి ఉద్యోగాల్లో స్థిరపడ్డ వారు ఊరు బాగు కోసం ఆలోచించి పెట్టలేదు సరి కదా, "భూగోళంలోకెల్లా దిక్కుమాలిన ఊరు" అని తిట్టుకొనేవారు.

"కాలం గడిచేకొద్దీ, ఒకరిద్దరు తప్ప ఆ ఊరి వయోవృద్ధులు ఒకరి తర్వాత ఒకరు కాలం చేశారు. యువకుల సంఖ్య పెరిగింది. వాళ్ళ గుండె నిబ్బరమూ పెరి

గింది. తెగించి తెప్పను తగులబెట్టి కాలవకి అడ్డంగా చిన్న వంతెన కట్టించుకొన్నారు. వంతెనదాటి అవతలవాళ్ళతో ఇచ్చి పుచ్చుకోడాలు జరిపారు. కానా కెత్తెదు కాలి బాటను వెడల్పుచేసి చిన్న రోడ్డు వేయించుకొన్నారు. చకచకా ఊరు పెరుగుతూ వచ్చింది. పట్టణానికి దారి ఏర్పడ్డంతో చదువులూ వ్యాపారాలూ పెరిగాయి. ఈ లోగా కరెంట్ వేయించాలని చీకట్లో ఉన్న పల్లెటూళ్ళకోసం దేశం వెర్రి లైట్ వేసి వెతుకుతుంటే ఈ ఊరు కనిపించింది. అంతే పక్కనున్న పట్టణం నుంచి కరెంట్ లాగడం మొదలెట్టారు. ఆ ఊరి జనం ఆంతా సంబర పడిపోయారు. "కోటి రూపాయలు పెట్టినా రాని కరెంట్" అడగకుండా వస్తుంది అని కేరింతలు కొట్టేశారు. ఊరివైపు పెరుగుతూ వస్తున్న కరెంట్ తీగల్ని ఎదురెళ్ళి చూశారు. వడ్డిమీద చేతులుంచుకొని పనులు చేయించే యింజినీర్లనీ చకచకా స్తంభాలు పాతి ఉడతల్లా పైకి పాకి తీగల్ని బిగించే పనివాళ్ళనీ చూసి మురిసిపోయారు.

"కాని మిగిలిన యిద్దరు వృద్ధులు కంటతడి పెట్టారు. స్టాటిస్టిక్స్ తీసకొనే వాళ్ళకి తెలియకగానీ, ప్రపంచంలోకెల్లా ఎక్కువకాలం బ్రతికిన ఘనత వాళ్ళదే.

"ఊళ్ళోవాళ్ళంతా వారి దగ్గరికి వెళ్ళి ఎందుకు విచారిస్తున్నారు అని అడిగారు.

"మనూరికి అనర్థం వస్తుందర్రోయ్ అని వాపోయారు వాళ్ళు.

"అనర్థంకాదు. దీని పేరు కరెంటు అన్నాడు ఒకతను.

"కరెంట్ లేవోయ్. కాశీకి వెళ్ళినపుడు దీన్ని కళ్ళారా చూశాము. యిది చాలా ప్రమాదం"

"ఏ అమ్మవారైనా శాపం యిచ్చిందా యిది రాకూడదని."

"నీ మొహం శాపం యివ్వాలా. ఇది కొంపలు తగుల బెడుతుంది. యిళ్ళ మీద నిప్పులు రాలుస్తుంది. ఊరు ఊరంతా బూడిదయి పోతుందర్రోయ్" అని బిగ్గరగా ఏడవడ సాగించారు. "మీ ఖర్మ తగులడండి" అనుకుంటూ జనంవాళ్ళిద్దర్నీ వదిలేసి వెళ్ళిపోయారు.

"ఆ వూరికి కరెంట్ వచ్చేసింది. ఊరంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. వారిద్దరు మూలుక్కుంటున్నా ఆ రాత్రి కోళ్ళు మేకలు విరివిగా తెగాయి. ఉన్న ఎత్తులోనే అధికారులకి విందులు చేసేరు. ఊరు పూరంతా పండుగ చేసుకొంది. ఆ కాంతిలో మొహమొహాలు చూసుకుని జనం ముచ్చటపడ్డారు. వయసులో ఉన్న దంపతులు కొత్త వెలుగులో మళ్ళీ శోభనం చేసుకున్నారు. ఊరంతా వెల్తురు ముద్దయి పోయింది.

"ఈ సందడి చల్లబడకుండానే టెలిఫోన్లు వేస్తారని మరో శుభవార్త. "ఓర్రిస్సాదియ్యా ఏం అదృష్టంరా" అని అనుకున్నారు. ఇంకా మిగిలిన ఆ యిద్దరు వృద్ధులు మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

"మళ్ళీ ఏం పోయేకాలం వచ్చింది" అన్నట్టు అడిగారు జనం.

"ఏమో బాబూ మీకు చెప్పలేం. హాయిగా ఆముదం దీపాలతో బ్రతికే

వాళ్ళం. కరెంటు లైట్లు తెప్పించి కళ్ళు పోగొట్టారా. స్తంభాలమీద నిప్పుతీగల్తో వెలగాటం ఆడుతున్నారా. ఇక దీన్ని తీసుకరండి'' అన్నారు విరుపుగా.

''దీనివల్ల ప్రమాదమేమిటో.''

''ఏవిటా. మీ చెవుల్ని యంత్రాలు చేస్తుంది మీలో సుఖం పెంచి కాలు కదపనీకుండా చేస్తుంది మిమ్మల్ని మొద్దుల్లా బద్ధకస్తుల్లా చేస్తుంది చావండి మీ ఖర్మ ఎలా ఉందో అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు

''జనం టెలిఫోను తీగల్ని చూడ్డానికి వెళ్ళారు. పల్లీ ఇంజనీర్లు పనివాళ్ళ కోలాహలం ఒకరిద్దరు తెలిసుకక యింజినీరుని ''అయ్యా ఫోను వల్ల లాభాలు తెలవిస్తారా'' అని అడిగారు ఆయన పైపై సర్దుకొని ''సహజ్ మీ ఊరుకి నిప్పంటు కొందమకో....'' అని ఎందుకో ఆగిపోయాడు.

''భళ బలేవారండి మీరు. ఊరికి నిప్పేమిటి. ఆ ముసలోళ్ళూ ఆ మాటన్నారు. మీరు అలాగే అంటున్నారు'' అని విసుక్కున్నారు. ఇంజనీరు ''అది కాదయ్యా నా ఉద్దేశ్యం. టౌన్లో నీళ్ళ కార్లుంటాయి ఫోన్లో పిలిస్తే నిమిషంలో వచ్చి ఆర్పేస్తాయి.'' అన్నాడు.

జనానికి ఉపయోగం వచ్చినా ఉదాహరణ రుచించలేదు. ఇంజనీరుమాత్రం బాధపడ్డాడు. సరైన ఎగ్జాంపుల్ ఎన్నుకోనందుకు.

చివరకి టెలిఫోన్లు వెలిసాయి. బాగా దబ్బున్న కొంపలు పంచాయితీ ఆఫీసు ఫోన్లు పెట్టించుకొన్నాయి.

''అంతా బాగానేఉంది కాని అమావాస్యకి పౌర్ణమికి ఆ వృద్ధుల ఏడుపు. యింజినీరు మాటలు గుర్తొచ్చి ఉలిక్కిపడతారు ఊళ్ళో జనం.''

శంకరం కథ చెప్పడం ఆపి సిగరెట్టు వెలిగించుకొన్నాడు.

''ఇలా ఉండగా ఒకరోజు ఏం జరిగిందో తెలుసా?'' అన్నాడు.

''ఏం జరిగింది'' అన్నాం ముందుకు వంగి.

''కరెంటు తీగ తెగిపడి ఒక తాటాకు కొంప గుప్పుమంది. మంటలు పైకి లేచాయి అంతకుముందు స్వతహాగా ఆర్పుకొనే జనం ఫోనుమొహం చూసి ఆగిపోయి టౌన్లో నీళ్ళకార్లని పిలిపించారు. మంటలు చుట్టూ అల్లుకొని వ్యాపించాయి. కాని నీళ్ళకార్లు వచ్చేలోగా చివరంటా కాలిన బీడీలా తురతురమంది ఊరు'' అంటూ ముగించాడు.

మేమంతా డిసప్పాయింట్ అయ్యాం. వెధవకథ అనికూడా అనేశాం. పలుగురం నానా మాటలు అన్నాం.

''ఇది శీలంలేని కథ.''

''పాపిష్టి వెధవా. బంగారంలాంటి ఊరుని తగలబెట్టావు కదరా.''

''కరెంటు పాత్రకి టెలిఫోను పాత్రకి తీరని అన్యాయం చేసావు కదరా.''

''నువ్వేం చెప్పదలుచుకున్నావు దీని ద్వారా.''

శంకరం తల విదిలించి ''అదే అడగ వద్దన్నాను ముందు'' అని జారుకున్నాడు.

—